## క్లుప్తంగా

### వేధింపుల భర్తపై కేసు

ప్రత్తిపాడు: భార్యను వేధిస్తున్న భర్తపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన గన్నవరపు మల్లేశ్వరికి ఇరవై మూడు సంవత్సరాల కిందట శ్రీనివాసరావుతో వివాహమయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. గత కొన్ని సంవత్సరాల నుంచి శ్రీనివాసరావు చెడు వ్యసనాలకు బానిసై, ఇంట్లో పోషణకి కూడా నగదు ఇవ్వకుండా, నిత్యం భార్యను కొడుతూ, తిడుతూ శారీరకంగా, మానసికంగా తీవ్రంగా హింసిస్తున్నాడు. ఈ మేరకు భార్య మల్లీశ్వరి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన మిడతాని నాగమణి(57) విజయవాడ సత్యన్నారాయణపురంలోని రామకృష్ణ హోంకేర్ సర్వీసులో పనిచేస్తుంది. హోంకేర్ సర్వీసు అవసరాల నిమిత్తం నాగమణిని సంస్థలో పనిచేస్తున్న నవీన్ బైక్‌పై ఈనెల 6వ తేదీన గుంటూరుకు పంపించారు. వారు ప్రయాణిస్తున్న బైక్ పెదకాకాని మండలంలోని నంబూరు అడ్డరోడ్డు సమీపంలోకి చేరుకునే సరికి బైక్ నడుపుతున్న నవీన్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి బైక్‌ను రోడ్డు పక్కనే ఉన్న రెయిలింగ్‌కు ఢీ కొట్టాడు. దీంతో బైక్‌పై కూర్చున్న నాగమణికి తలకు గాయం కాగా నవీన్‌కు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి నాగమణి మరణించింది. పోలీసుల సమాచారం మేరకు గుంటూరు చేరుకున్న కుమారుడు మిడతాని దుర్గారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

### మేకపిల్లను కాపాడబోయి చెరువులో పడి వృద్ధుడి మృతి

కొమ్మూరు(కాకుమాను): మేకపిల్లను కాపాడపోయి చెరువులో పడి వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని కొమ్మూరులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బాజీ అనే వృద్ధుడు జీవాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈక్రమంలో శనివారం రోజు మాదిరిగానే గ్రామంలోని తాగునీటి చెరువు పరసర ప్రాంతాల్లో తన జీవాలను తీసుకువెళ్లి ప్రసుగ్రాసం అందిస్తుండగా ప్రమాదవశాత్తు ఒక మేక పిల్ల చెరువులో పడిపోయింది. గమనించిన గ్రామానికి చెందిన వేముల జగ్జీవనరావు(53) మేక పిల్లను రక్షించేందుకు చెరువులోకి దిగాడు. చెరువు లోపల అధిక లోతు ఉండడంతో కొద్ది నిమిషాల్లోనే జగ్జీవనరావు కనిపించకుండా పోయాడు. కాకుమాను నుంచి గజ ఈతగాళ్లను తీసుకువచ్చినప్పటికి మృతదేహం లభ్యం కాకపోవడంతో బాపట్ల నుంచి గజ ఈతగాళ్లను రప్పిస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.ఆదివారం మధ్యాహ్నానికి జగ్జీవనరావు మృతదేహాన్ని బయటకు తీయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### అంగన్‌వాడీ కేంద్రాలు సంపూర్ణ ఆరోగ్య నిలయాలు

బోడిపాలెం(కాకుమాను): అమ్మఒడి లాంటి అంగన్‌వాడీ కేంద్రాలలోనే చిన్నారులకు కావల్సిన అన్ని వసతులు ఉన్నాయని జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని బోడిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాలను శనివారం మండల ప్రత్యేకాధికారి, గ్రామ సర్పంచ్, తహసీల్దార్‌లతో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ బాల్యం నుంచే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు నెల నెలా మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజు చిన్నారులకు ఆకు కూరలు, పిండి పదార్థాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా పిండి వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ నలిగల ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు, మండల ప్రత్యేకాధికారి ప్రేమ కుమారి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, నలిగల యెషయ్య, అంగన్‌వాడీ పాండ్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### చలపతిలో ముగిసిన వర్క్‌షాప్

గుంటూరు రూరల్: వర్క్‌షాపుల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతకు మెరుగులు దిద్దవచ్చని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గత ఐదు రోజులుగా జరుగుతున్న పైతాన్ ప్రోగ్రాంపై వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకుంటూ సద్వినియోగించుకోవాలన్నారు. డెవలప్ ట్రీస్ ప్రతినిధి శ్రీహరిరాజు, మల్లిఖార్జునరావులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ రంగంలో అపార అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు యాప్ డిజైన్, వెబ్‌సైట్ డిజైన్, వివరించారు. డాక్టర్ కేవీ రామారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్యం

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
- ప్రారంభించిన ప్రజాప్రతినిధులు. అధికారులు
- నిపుణులైన వైద్యులచే ఉచిత వైద్యసేవలు


వెనిగండ్లలో వైద్యసేవలను పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, తహసీల్దార్ రత్నం


వెనిగండ్లలో వైద్య శిబిరం వద్ద రంగవల్లులు అలంకరిస్తున్న సర్పంచి వేల్పుల శ్రావణి, వైద్య సిబ్బంది

పెదకాకాని: ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి అన్నారు. మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వారికి వైద్యపరీక్షలు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. దశల వారీగా మెడికల్ క్యాం


పొన్నూరులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పు నిర్వహించడానికి 15 రోజుల ముందే ఇంటింటికీ వెళ్లి అనారోగ్య సమస్యలను గుర్తించడం, టోకెన్లు మంజూరు చేయడం, హెల్త్ క్యాంపుపై అవగాహన కల్పించడం, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిపుణులైన వైద్యులచే వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. రోగుల సమస్య ఆధారంగా అవసరాన్ని బట్టి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఉన్న ఆసుపత్రులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ శిబిరంలో 550 మందికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం ఏర్పాట్లను వెనిగండ్ల పీహెచ్‌సీ మల్టీపర్పస్ హెల్త్‌ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గజ్జల శ్రీనివాసరావు, క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ వరప్రసాద్ పర్యవేక్షించారు. 162 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 138 మందికి కళ్లజోళ్లు ఇస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కెఎస్ఎల్ఎన్ చారి, డాక్టర్ సీహెచ్ విజయప్రకాష్, డాక్టర్ అనూష, డాక్టర్ భవిష్యలు పేషెంట్లకు వైద్యసేవలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలలో హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్, డాక్టర్ రూం, వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం వంటి ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార పదార్థాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, తహసీల్దార్ పి.రత్నం, సూపరింటెండెంట్ సర్పంచి వేల్పుల శ్రావణి, ఉప సర్పంచి కొండమడుగుల వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచులు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, బుల్లా ఆశీర్వాదం, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, వేల్పుల నాగరాజు, కాట్రోత్ సేవియా, ఉపాధ్యాయుడు ఎస్.వెంకటరెడ్డి, పీఈటీ మస్తాన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

**పొన్నూరులో...**

పొన్నూరు: పేద ప్రజలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలన్న ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పొన్నూరు మండలంలో విశేష స్పందన లభిస్తుంది. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, వలంటీర్లు గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్షపై అవగాహన కలిగిస్తున్నారు. ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. చికిత్స అవసరం ఉన్నవారికి వైద్య శిబిరంలో పాల్గొనే విధంగా టోకెన్లను అందజేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మాచవరం గ్రామంలో ఆరోగ్య సురక్ష మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 371 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**బోడిపాలెంలో...**

బోడిపాలెం(కాకుమాను): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఆరోగ్య రక్షగా మారిందని గ్రామ సర్పంచ్ నలిగల ఉషారాణి అన్నారు. మండలంలోని బోడిపాలెంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ ఉషారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి తేళ్ల ప్రేమకుమారి మాట్లాడుతూ గ్రామాలలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి తమ ఇంటి వద్దకే వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా పలువురికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు, తహసీల్దార్ ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, నలిగల యెషయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పాల్గొన్నారు.

**ప్రత్తిపాడులో...**

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ప్రత్తిపాడు-3 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధార్థ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి మొత్తం 211 మంది రోగులు హాజరయ్యారు. వారికి వైద్యాధికారులు డాక్టర్ దివ్య మేఘన, కెజియా గ్రేస్, అంజనీదేవి, వంశీ, ముఖేష్, సయ్యద్ లు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను అందించారు. సమస్య తీవ్రంగా ఉన్న 15 మంది రోగులను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు.

**వరగానిలో...**

పెదనందిపాడు: ప్రభుత్వం అందరికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను వినియోగించుకోవాలని తహసీల్దార్ సుభాని తెలిపారు. శనివారం మండల పరిధిలోని వరగాని గ్రామం ఎస్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న తహసీల్దార్ సుభాని ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు తమ సమస్యలను వైద్యాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ రాజగోపాల్, ఈఓపీఆర్డీ సాయిలీల, సర్పంచ్ బొద్దు మేరిమ్మ, ఏబీపాలెం సొసైటీ అధ్యక్షుడు కె.భూషయ్య, వైద్యాధికారులు జి.లావణ్య, ఎండీ అతియా, వి.అనిల్ కుమార్, మేరి యునిక, సీహెచ్ఓ ప్రసాద స్వామి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


శేకూరులో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం వద్ద వైద్య సేవల కోసం క్యూలో ఉన్న వృద్ధులు

**శేకూరులో...**

శేకూరు(చేబ్రోలు): చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా మెడికల్ క్యాంపులో 768మంది వైద్య సేవలు పొందినట్లు వైద్యాధికారి కొత్తపల్లి బాబురావు తెలిపారు. గ్రామంలోని మహిళలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు వైద్యసేవలు పొందుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య పరీక్షలు చేసివ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో కొత్తగా 263మందికి షుగర్ వ్యాధి ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. 255మందికి బీపీ, 189మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 53మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. 18మందికి ఈసీజీ టెస్ట్‌లు చేశారు. వైద్యులు కొత్తపల్లి బాబురావు, అబ్రహం లింకన్, కిరణ్‌కుమార్, శైలజ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. శనివారం మండలంలోని ఓబులునాయుడు పాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ఆయన సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశాఖ, అధికారులు, గ్రామ సచివాలయం ఉద్యోగులు ప్రజలకు ఏ సమస్యకు ఎక్కడికి వెళ్లాలో తెలియని వారికి ఎక్కడ ఎటువంటి పరీక్షలు చేస్తారో వివరించాలని సూచించారు. గ్రామ సర్పంచి కేశం శ్రీలక్ష్మి హరనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అనేక రకాల పరీక్షలు, బీపీ, షుగర్, ఎకో, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీలు, ఊపిరితిత్తుల సమస్యలు, కాళ్లు, కీళ్ల నొప్పులు, తదితర అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయటం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా మెరుగైన చికిత్సల నిమిత్తం సంబంధిత ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేస్తారని తెలిపారు.


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌లను అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు

ఎంపీడీఓ ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 589 మంది తమ పేర్లను రిజిష్టర్ చేసుకున్నారని తెలిపారు. అందులో 423 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారన్నారు. స్త్రీల వ్యాధులకు సంబంధించి 9 మంది, కీళ్ల వ్యాధులకు 67 మంది, 261 మంది కంటి సంబంధిత సమస్యలకు, 120 మంది వివిధ రకాల వైద్య సేవలు వినియోగించుకున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా అర్హులైనవారికి ఉచితంగా కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్.వజ్రశ్రీ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి యమున, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


పెదకాకాని శివాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఏసీ ఎన్.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ ఎ.శంకరరావు - పొన్నూరు

## 15 నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు

గుంటూరు రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నల్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీనుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్యామల రఘునాధరెడ్డి, అర్చక స్వామి తుర్లపాటి ప్రసన్నాంజనేయకుమార్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ ఆదివారం అమ్మవారికి బాలత్రిపురసుందరిదేవి అలంకారం, 16 గాయత్రిదేవి, 17 అన్నపూర్ణాదేవి, 18 మహాలక్ష్మిదేవి, 19 పార్వతిదేవి, 20 సరస్వతిదేవి, 21 లలితాదేవి, 22 దుర్గాదేవి, 23 మహిషాసుర మర్ధిని(రజత కవచాలంకృత), మధ్యాహ్నం రాజరాజేశ్వరిదేవి అలంకారం నిర్వహించటం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రతి ఉదయం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 7 గంటలకు పంచహారతుల కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక పూజల్లో పాల్గొనే భక్తులు తమ పేర్లను ఆలయంలో తమ గోత్రనామాలతో నమోదు చేసుకోవాలన్నారు.

## విద్యార్థులు బాధ్యతలను గుర్తించి స్వీకరించాలి

పెదకాకాని: విద్యార్థులు విద్యార్థి దశలోనే బాధ్యతలను గుర్తించి వాటిని స్వీకరించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాన్ని అందుకోగలుగుతారని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో శనివారం 2023-24 సంవత్సరానికి ఎన్నికైన విద్యార్థి విభాగం శాక్ (స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్) సభ్యులచే ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి హాజరయ్యారు. సవాళ్ళ పరిష్కార మార్గాన్ని తెలిపేందుకు కళాశాలలో 21 విద్యార్థి శాఖలతో 126 మంది విద్యార్థులతో ఏర్పాటు చేసిన విద్యార్థి విభాగం సభ్యులచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ప్రతినిధులన్నారు. నాయకత్వ లక్షణాలు కలిగిన విద్యార్థుల పర్యవేక్షణలో విద్యార్థుల ప్రణాళికలకు తోడ్పాటు అందించే శాక్ వీవీఐటీ కళాశాల ప్రత్యేకమన్నారు. శాక్ విభాగం వీవీఐటీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపును అందిస్తుందన్నారు. ఎన్నికైన 126 మంది శాక్ విద్యార్థులు కళాశాలలోని విద్యార్థులందరికీ వన్నె తెచ్చే విధంగా మెలుగుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. వీవీఐటీ విద్యార్థులకు మధుర స్మృతులను అందిస్తుందన్నారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ శాక్ సభ్యులు కళాశాల నిర్వహణ, విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు అవసరమైన సహకారాలను అందిస్తారన్నారు. అనంతరం శాక్ సభ్యులుగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, అధ్యాపకులు అభినందించారు.


వీవీఐటీలో శాక్ విద్యార్థి విభాగంచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి

## సీహెచ్‌సీలో 24 గంటలూ వైద్య సేవలు

ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యధిద్య

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇకపై 24 గంటలూ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందనున్నాయని మత్తు వైద్యనిపుణుడు డాక్టర్ యధిద్య అన్నారు. శుక్రవారం అర్ధరాత్రి పాత మల్లాయపాలెం గ్రామానికి చెందిన జమ్ములమడుగు విజయమ్మ పాముకాటుకు గురయింది. దీంతో స్థానికులు ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అదే సమయంలో విధుల్లో ఉన్న డాక్టర్ యధిద్య ఆమెకు అత్యవసర వైద్యం అందించారు. గతంలో ఆస్పత్రికి ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఆస్పత్రికి వస్తే.. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సులు గుంటూరుకు రెఫర్ చేసేవారు. గుంటూరు వెళ్లేవరకు ప్రాణం ఉంటుందో పోతుందో తెలియని పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేశారు. దీంతో వైద్యులు రోస్టర్ విధానంలో అత్యవసర సమయాల్లోనూ అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ యధిద్య మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇకపై రౌండ్ ది క్లాక్ ప్రజలకు వైద్యం అందుతుందని ఆయన చెప్పారు. ప్రజలు ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు.


అర్ధరాత్రి అత్యవసర వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ యధిద్య


## ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

కొండపాటూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశించే ప్రతి విద్యార్థి విద్యలో రాణించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు పాఠశాల హెచ్ఎం శీలం అంకారావు అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన ఎఫ్ఏ-2 పరీక్షల్లో మొదటి, రెండు స్థానాలు సాధించిన విద్యార్థులతో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంకారావు మాట్లాడుతూ విద్యార్థులు పోటీపడి చదివి ఉన్నతస్థానాలలో నిలవాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యలో పోటీ ఉండాలని అప్పుడే ప్రతి ఒక్కరు ప్రథమ స్థానంలో ఉంటారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా 1 నుంచి 8 తరగతిలో ఎఫ్ఏ-2 పరీక్షల్లో ఒకటి, రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో హెచ్ఎం శీలం అంకారావు

## ఆరోగ్య భద్రతపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: మహిళల్లో పౌష్టికాహారం లోపం వల్ల, విటమిన్ డీ లోపం వల్ల కలిగే నష్టాలను అధిగమించేందుకు తగిన ఆరోగ్య భద్రతలను పాటించి నివారించుకోవచ్చని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప తెలిపారు. నగర శివారుల్లోని లాం ఫాంనందున్న కృషి విజ్ఞాన కేంద్రంలో తాడికొండ మండలం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విటమిన్ డి లోపం వల్ల వచ్చే వ్యాధులను వివరించారు. చిన్న పిల్లల్లో పెద్దవాళ్ళలో ఎముకలకు సంబంధించిన సమస్యలను వివరించారు. కోవిడ్ లాంటి అంటువ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ఆహారంలో విటమిన్ డి ఎంతో అవసరమని తెలిపారు. రోజు సూర్యరశ్మితోపాటు పాలు, గుడ్లు, పుట్టగొడుగులు, పెరుగు, చేపలు, నువ్వులు, జున్ను, మొక్కజొన్నలు ఆహారంలో తీసుకుంటూ ఉండాలన్నారు. విటమిన్ డి లోపం వల్ల త్వరగా అలిసిపోవటం, బరువు పెరగటం, అజీర్తి, ఎముకల సమస్యలు, తరచూ జలుబు చేయటం, దగ్గు వంటివి వస్తాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డీఆర్‌డీఏ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ దీప తదితరులు

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదకాకాని: క్రిమిసంహారక విష మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం, వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన బొడ్డు చలపతిరావు కుటుంబం వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఈ నెల 5వ తేదీ తెల్లవారు జామున పొలానికి వెళ్లిన ఆయన ఎలుకలను చంపడానికి ఉపయోగించే విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాంతులు చేసుకుంటున్న చలపతిరావును చూసిన కానుగోలు వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడు చలపతిరావును చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎ యిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న చలపతిరావు(57) పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. కౌలు పొలం సాగుచేస్తూ అప్పులపాలైన తన తండ్రి అప్పులు తీర్చలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని కుమారుడు నాగపవన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

### దావా సమన్లు

IN THE COURT OF THE I ADDL. SENIOR CIVIL JUDGE : GUNTUR
O.S. No. 44 / 2017
Between:
Ravula Lakshmi Kumari. ...Plaintiff
And
Katam Kanakamma (Died) & Others. ...Defendants
To,
D-5: K.Kanaka Vijaya, W/o Anjaneyulu, R/o. Gunjipallivaripalem, Pathamallayapalem (Vil), Prathipadu(Md), Guntur Dist.

V. USHA KIRAN REDDY
Advocate for Plaintiff, Ankireddy Palem, Guntur. Cell: 9010228694